Visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నిజామాబాద్

కామారెడ్డి

బుధవారం, 26 జూన్ 2024

పేజీలు : 04

## జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ

బీర్కూర్, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్

బీర్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అధ్యాపకులు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రఘు, ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి లు మాట్లాడుతూ., విద్యార్థులు బాగా చదువుకొని మంచి స్థానాల్లో స్థిరపడాలని అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను గురించి విద్యార్థులకు ప్రిన్సిపల్ వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సందీప్, కో ఆప్షన్ ఆరిఫ్, నాయకులు యామ రాములు, కిరణ్, అధ్యాపకులు చంద్రశేఖర్, దేవి సింగ్, శ్యామ్, సావిత్రి, నారా గౌడ్ తదితరులున్నారు.



## పాఠశాలల బంద్ కు సహకరించండి

### ఏబీవీపీ లింగంపేట్ శాఖ పిలుపు

లింగంపేట్, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్

పాఠశాల బందుకు సహకరించాలని ఏబీవీపీ లింగంపేట్ మండల కార్యదర్శి నవీన్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం లింగంపేట్ మండల కేంద్రంలోని ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో విలేకరులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు కార్పొరేట్ పాఠశాల శక్తులు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు ఎంతో హీనంగా ఉన్నాయని వీటి పైన ఎన్నోసార్లు విద్యాధికారులకు చెప్పిన పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అధికారుల తీరుపై మండి పడ్డారు. ప్రభుత్వం పనితీరును నిరసిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలకు బందుకు పిలుపు నివ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగానే లింగంపేట్ మండలంలోని అన్ని విద్యాసంస్థలు బంద్ చేయాలని కోరారు.



## ప్రజాస్వామ్యానికి చీకటి రోజు ఎప్పటికీ మర్చిపోము...

### ఎప్పటికీ క్షమించం : యెండల లక్ష్మినారాయణ

### జూన్ 25 1975 ప్రజాస్వామ్యానికి చీకటి రోజు




కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్

భారతదేశంలో ఎమర్జెన్సీ అనేది 1975 నుండి 1977 వరకు 21 నెలల వ్యవధిలో ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దేశానికి అంతర్గత మరియు బాహ్య బెదిరింపులను ఉదహరిస్తూ దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఈ రోజుకి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 25 1975 ప్రజాస్వామ్యానికి చీకటి రోజు పేరిట బీజేపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి, సెమినార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద గల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నల్ల రిబ్బన్ లతో నిరసన చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మినారాయణ మాట్లాడుతూ., ఎమర్జెన్సీ కి వ్యతిరేకంగా పోరాడిన వీరులను, ఉద్యమకారులను స్మరించుకున్నారు. 1977 మార్చి 21వరకు ఇందిరాగాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలు పాలు చేసి పత్రికలను సెన్సార్ చేశారన్నారు. వాస్తవాలను చెప్పేందుకు ప్రయత్నించిన పత్రికలపై తీవ్ర నిర్బంధం విధించారని, ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతునొక్కారని, ఎన్నో సంస్థలను రద్దు చేశారని విమర్శించారు. భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలోనే 1975 జూన్ 25న ఒక చీకటి రోజు గా నిలిచిపోయిందని అన్నారు. ఇదే రోజున నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దేశంలో అంతర్గత అస్థిరతను, అశాంతిని కారణంగా చూపుతూ జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించి, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కారు. ఇదే రోజున ప్రధాన మంత్రి ఆదేశాల మేరకు హేమాహేమీ నాయకులైన అటల్ బిహారీ వాజ్‌పేయి, మొరార్జీ దేశాయ్, బిజూ పట్నాయక్, చంద్రశేఖర్ లాంటి మరెందరో ప్రముఖులతో సహా లక్ష మందికి పైగా ప్రజలను నిర్బంధించి జైళ్లలో పెట్టారు. అంతేకాకుండా ఎన్నికలు వాయిదా వేయడం, ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను ఉక్కుపాదంతో అణచివేయడం, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు విధించడంతో పాటు కొన్ని చట్టాలను ప్రభుత్వానికి అనుకూలంగా మార్చడం జరిగిందని అన్నారు. 'ఎమర్జెన్సీ' అంటే ఇందిరా గాంధీకి ఒక పర్యాయపదంగా మారిపోయింది. 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ 1977 మార్చ్ 21 వరకు అంటే 21 నెలల పాటు అమలులో ఉంది. నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 ప్రకారం దేశంలో అంతర్గత అశాంతిని కారణంగా ఉటంకిస్తూ అధికారికంగా ఎమర్జెన్సీని జారీ చేశారని కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, ప్రధాన కార్యదర్శి లు నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, నాయకులు భరత్, శ్రీకాంత్, చారి, లక్షరెడ్డి, శ్రీనివాస్, రవీందర్, వెంకట్, గంగారెడ్డి, రాజు లతో పాటు 100 మంది బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## పది ఎకరాల లోపు రైతులకు రైతు భరోసాను చెల్లించాలి.

ఎడపల్లి, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్

ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. దీంట్లో భాగంగా రైతుల నుంచి అభిప్రాయాలు సూచనలను సేకరించారు. రైతు భరోసాపై ఎడపల్లిలోని మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో రైతులు మాజీ ఉప సర్పంచ్ మాట్లాడారు. రైతు భరోసాపై పది ఎకరాల లోపు మాత్రమే రైతులకు రైతు భరోసాని చెల్లించాలని రాళ్లూరప్పలు, గుట్టలు పరిధి భూములు కలిగిన వాడికి చెల్లించవద్దని వారు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ హాజరై రైతుల ద్వారా లిఖితపూర్వకంగా పలు అభిప్రాయాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి సొసైటీ చైర్మన్ పోల మల్కా రెడ్డి, జనగాం మోహన్ రెడ్డి, ఎల్లయ్య యాదవ్, ఏవో సిద్ధి రామేశ్వర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# మామూళ్ల మత్తుల్లో ఎక్సైజ్ శాఖ

- మత్తు కల్లును పెంచి పోషిస్తున్న ఎక్సైజ్ శాఖ
- ఆబ్కారీ శాఖలో శాంపిళ్ల సేరణలో మాయాజాలం
- డిపో సీజ్ చేయాలంటే ఒక రకం, కల్లు ముస్తేదారులను కాపాడాలంటే మరొక రకంగా శాంపిళ్ల సేకరణ
- కాసులు కురిపిస్తున్న శాంపిళ్లు





**కామారెడ్డి బ్యూరో**
**సూర్య మేజర్ న్యూస్, జూన్ 25**

ఉమ్మడి జిల్లాలో మత్తు పదార్థాల రవాణా జోరుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రధానంగా కల్లు తయారీలో వినియోగించే నిషేధిత మత్తు పదార్థం అల్ఫాజోలం వినియోగం జోరుగా సాగుతుంది. గత నెల చివరి వారంలో రెంజల్ మండల కేంద్రంలో కల్లు డిపో నిర్వహిస్తున్న బైరా గౌడ్ అల్ఫాజోలం రవాణా చేస్తూ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులకు చిక్కారు. అతను కల్లు ముస్తే దారు ముసుగులో నిషేధిత మత్తు పదార్థాల రవాణా దందాలో కీలకంగా ఉన్నట్లు గుర్తించి ఎక్సైజ్ శాఖ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో ఈ నెల ఎక్సైజ్ అధికారులు బైరాగౌడ్ కు సంబంధించిన కల్లు డిపోలో శాంపిళ్లను సేకరించారు. అక్కడా మత్తు పదార్థం కలిపి విక్ర యాలు జరుగుతున్నాయో కావో తేల్చేందుకు నిర్వ హించిన శాంపిళ్ల సేకరణ అంతా ప్రహసనంగా జరిగింది. ఎక్సైజ్ అధికారులు కల్లు డిపోలో కల్లు తయారయ్యే పీపాలో కల్లు సేకరించకుండా బోధన్ ఎక్సైజ్ కార్యాలయంకు మూడు కల్లు సీసాలను తెప్పించుకుని వాటితోనే శాంపిల్స్ సేకరించామని పంచనామా రాయడం గమనార్హం. కల్లు సొసైటీ ఆధ్వర్యంలో ఉండే డిపో లో కృత్రిమ కల్లు తయారీ అనేది రోజు వారిగా జరిగేదే. కానీ బోధన్ అధికారులు సేకరించిన శాంపిల్ వ్యవహారం ఇప్పుడు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.



### మత్తు కల్లును పెంచి పోషిస్తున్న ఎక్సైజ్ శాఖ

జిల్లాలో మత్తు కల్లు ను ఆబ్కారీ శాఖని పెంచి పోషిస్తుంది. పేరుకు మద్య పాన నియంత్రణ, మత్తు పదార్థాల రవాణా అడ్డుకట్ట వేస్తామని చెప్పే శాఖనే కృత్రిమంగా రసాయనాల తో తయారయ్యే కల్లు అమ్మకాలను ప్రోత్సహిస్తుందని చెప్పాలి. ఉమ్మడి జిల్లాలో ఈత చెట్లు, తాటి చెట్లు లేకపోయినా కల్లు మాత్రం రోజు లక్షల లీటర్లలో ఉత్పత్తి అవుతున్న విషయం తెల్సిందే. మత్తు పదార్థాలను కలిపి విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తే అందుకు సంబంధించి శాంపిళ్లు తీసి అవి మత్తు కల్లు లేక చెట్టు కల్లు అని నిర్ధారించాల్సిన శాఖనే మత్తు పదార్థాల తయారయ్యే కల్లులో కల్తీ లేదని సర్టిఫికేట్ ఇచ్చే కల్చర్ జోరుగా సాగుతుంది. ఎక్సైజ్ శాఖ వద్ద ప్రధానంగా క్లోరో ఫాం, డైజోఫాం, క్లోరో హైడ్రేట్ లాంటి మత్తు పదార్థాలను కలిపి కల్లును తయారు చేసి విక్రయాలు జరుపుతుంటే దానిని గుర్తించి ల్యాబ్ లు సామగ్రి అంతా ఎక్సైజ్ శాఖ వద్ద ఉంది. అల్ఫాజోలం అనే నిషేధిత మత్తు పదార్థం కలిపి తయారు చేసి కృత్రిమ కల్లును గుర్తించే సామగ్రి లేదని అందుకు శాంపిళ్లను సేకరించి హైదరాబాద్ పంపడం ఆనవాయితీ వస్తుంది. ఇప్పుడు అదే శాంపిల్ సేకరణ ఎక్సైజ్ శాఖకు కాసులు కురిపి స్తోంది. కల్తీ కల్లును గుర్తించేందుకు సేకరించే శాంపిళ్ల వ్యవహారంలో ముస్తేదార్ల నుంచి డిపోల నుంచి డబ్బులు వసూలు జరుగుతున్నాయి. లేకపో తే ఎక్కడా కల్తీ కల్లు గుర్తిస్తే లైసెన్సులు రద్దు కావ డం, డిపోలు మూతపడతాయని సొసైటీల నిర్వాహకులు భయ పడడమే ఎక్సైజ్ అధికారులకు వరంగా మారింది. జిల్లాలో ఎక్సైజ్ అధికారులు కల్లు డిపోలలో శాంపిళ్ల సేకరణ అనేది ఆదాయ వనరుగా మార్చు కున్నారని చెప్పడానికి రెంజల్ కల్లు డిపో వ్యవహా రమే ఉదాహరణగా చెప్పాలి. కల్తీకల్లు నిషేదిత పదార్థాలతో తయార వుతున్న ఫిర్యాదులు వస్తే చాలు శాంపిళ్లు సేకరిం చాల్సిన ఎక్సైజ్ శాఖ దానిని మరి చిపోయింది. ఎక్సైజ్ శాఖలో పక్కాగా కల్లు డిపోను సీజ్ చేయాలంటే ఒక విధంగా డిపోను కొనసాగింది.

## నేత్రపర్వంగా గంగాదేవి కళ్యాణ మహోత్సవం

**బిక్కనూర్, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్ర పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి వేద బ్రాహ్మణుల మంత్రోచ్చాల మధ్య కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి అమ్మవారికి ఓడిబియ్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చినా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గంగమ్మకు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



## శ్రీ సీత రామ మందిరం నిర్మాణానికి విరాళం అందించిన మైనారిటీ యువకుడు.

**రుద్రూర్, సూర్య మేజర్ న్యూస్, జూన్ 25**

రుద్రూర్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ సీత రామమందిర నిర్మాణానికి రుద్రూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ ఇమ్రాన్ రూ.18వేల విరాళం అందచేశారు. శిధిలావస్థకు చేరిన మందిర పునః నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పునర్నిర్మాణం చేపట్టారు. మందిర నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా రూ.18వేలు ఇచ్చిన ఇమ్రాన్ ను ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు అభినందించారు.



## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం.

**ఎడపల్లి, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్**

ఎడపల్లి మండల కేంద్రంలో రైతులకు రెండు లక్షల ఋణమాఫీ క్యాబినెట్లో సీఎం రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆమోదించడం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు బోధన్ శాసనసభ సభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి కి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ., ఏకకాలంలో రైతులకు రుణమాఫీ క్యాబినెట్లో నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. గత ప్రభుత్వాలు చేయని రుణమాఫీని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయడం సంతోషకరమైన విషయమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ కేత్ ఎడపల్లి అధ్యక్షుడు ఎక్కులూరి శివరామ ప్రసాద్, బోధన్ మాజీ సీడీసి చైర్మన్ శంకర్ నాయుడు, సింగిల్ విండో చైర్మన్ పోల మల్కరెడ్డి, ఇరేటి లింగం, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బంజ కామప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైదం ప్రతాపరెడ్డి, యాసడ రాజ్ కుమార్ ,రత్నాకర్ రెడ్డి, ఐరండ్ల నవీన్, మచ్కూరి గంగాధర్, బండారు హబీబ్, మనోజ్, ఆర్.స్వామి గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నేడే కిసాన్ మేళా.

**కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, జూన్ 25**

జాతీయ మాంస పరిశోధన సంస్థ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రోజున స్థానిక మున్సిపల్ కళాభారతి ప్రాంగణంలో కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోసియేషన్ డాక్టర్ శరత్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., పివీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం డైరీ టెక్నాలజీ కళాశాలలో బుధవారం రోజున నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కిసాన్ మేళాలో వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖలైన పశుసంవర్ధక శాఖ, హార్టికల్చర్ ఫిషరీస్, పరిశ్రమ పరిశ్రమల శాఖ, విజయ డైరీ ,నాబార్డ్ టైగర్ సంస్థల తమ స్టాల్స్ ను ఏర్పాటు చేసి వారి వారి శాఖల ద్వారా చేపడుతున్న వివిధ స్కీములను వివరించి ఆ శాఖలకు సంబంధించిన పరికరాలను ఉత్పత్తులను ప్రదర్శించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా రైతులందరూ ఉపయోగించుకోవాల్సిందిగా కళాశాల అసోసియేట్ డాక్టర్ శరత్ చంద్ర తెలిపారు.

# సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

బోధన్, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తున్నట్టు ప్రకటించడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు సాలూర మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సాలూర మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందార్నా రవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని మరోసారి నిరూపించిందని అన్నారు. ఏ ప్రభుత్వం చేయలేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తుండటం గర్వించదగ్గ విషయమని అన్నారు. అలాగే రైతులు ఎదుర్కొంటున్న ధరణి సమస్యలను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కలెక్టర్తో సమీక్షలు నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నారని ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని ఇది ప్రజా ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, అల్లే జనార్ధన్, అల్లే రమేష్, మాజీ ఎంపీటీసీ చీల శంకర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బిహరి, ఇంతకు గంగాధర్, కమ్మనపల్లి శ్రీనివాస్, మార్కాల్ శివకుమార్ యూత్ కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీను, ప్రకాష్, స్వామి గౌడ్, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అల్యూమిని మీట్, గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్

సదాశివనగర్, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్

సదాశివనగర్ మండలంలోని మర్కల్ స్టేజి వద్ద గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులను ఆహ్వానించి కళాశాల కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో ఆలిమినీ మీట్ మరియు గ్రాడ్యుయేషన్ డే ను విద్యార్థుల ఆనంద ఉత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాధిక అధ్యక్షత వహించారు. కళాశాల పూర్వ ప్రిన్సిపల్ గా పనిచేసిన పి. జనార్ధన్ రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామారెడ్డి రిటైర్డ్ లెక్చరర్ ఎం వీరయ్య ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి వి.రేణుక, అకాడమిక్ కోఆర్డినేటర్ కె.వనజ, కల్చరల్ కోఆర్డినేటర్ ఆర్. ఉదయని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# కామారెడ్డి లో ఘోర రోడ్డు ప్రమాదం.. లారీని వెనుక నుండి ఢీకొన్న బస్సు.

## బస్సులో ప్రయాణిస్తున్న ఒకరు మృతి, పలువురికి గాయాలు



కామారెడ్డి రూరల్, సూర్య మేజర్ న్యూస్, జూన్ 25

కామారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో కామారెడ్డి మండలం క్యాసంపల్లి శివారులోని 44వ జాతీయ రహదారిపై వెనుక నుంచి ప్రైవేటు బస్సు లారీని ఢీ కొట్టింది. లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో స్పీడ్ గా వస్తున్న ప్రైవేటు బస్సు అదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళుతుండగా కామారెడ్డి సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఆదిలాబాద్ కు చెందిన విద్యార్థి అప్సర్ ఖాన్ (22) అక్కడికక్కడే మృతి చెందగా, బస్సులో ఉన్న మరో 28 మందికి గాయపడ్డారు. వారిలో పది మందిని అంబులెన్స్ లో కామారెడ్డి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్కు తరలించారు. రోడ్డు ప్రమాదంలో జరిగిన సంఘటన తెలిసిన వెంటనే దేవుని పల్లి పోలీసులు రూరల్ సీఐ రామన్ ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రైవేటు బస్సు ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్కు వెళ్తుండగా మహారాష్ట్ర నుంచి హైదరాబాద్కు గోధుమల లోడుతో వెళ్తున్న లారీ క్యాసంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్ల సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు లారీని ఢీకొట్టింది బస్సులో అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం సాకేర గ్రామానికి చెందిన జావేద్ లక్ష్మి ఆమె భర్త జాదవ్ అరవింద్ ఫార్మర్ కు చెందిన ప్రశాంత్ అదిలాబాద్ కు చెందిన రుచిత రాము అనూష నిర్మల నిర్మల్కు చెందిన సత్యం ఎస్కే వైజాగ్ మూవీ అశ్విన్ హైదరాబాద్ కు చెందిన అశ్విన్ నయన అదిలాబాద్ కు చెందిన హనుమంతు రసూల్ బి గ్రూప్ సార్ నితీష్ లక్ష్మణ్ కవిత నాందేడ్ కు చెందిన రఫిక్ హైదరాబాద్కు చెందిన రాణి సంతోష్ అశోక్ కర్నాల భీముడు సుధా లహరిక గంగా చంద్ర దీపిక శ్రేయ కందకర్ల గాయపడ్డారు దేవునిపల్లి పోలీసులు బాధితులను ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు 44వ జాతీయ రహదారిపై తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గంట పాటు ట్రాఫిక్ నిలిచి పోయింది. పోలీసులు అప్రమత్తమై ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. దేవుని పల్లి ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది కొండల్ రెడ్డి, లక్ష్మణ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



# టీఎస్ బిపాస్ కింద మార్గదర్శకలకు లోబడి ఉన్న లేఔట్లకు అనుమతులు మంజూరు.

## జిల్లా కలెక్టర్



కామరెడ్డి, సూర్య మేజర్ న్యూస్, జూన్ 25

టిఎస్ బిపాస్ కింద ప్రభుత్వం మార్గదర్శకలకు లోబడి ఉన్న లేఔట్లు కు 21 రోజులోగా అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి లేఅవుట్ కమిటీ సమావేశంలో సభ్యుల ఉద్దేశించి మాట్లాడుతూ సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిబంధనల మేరకు లేఔట్లు ఉన్నాయా లేవా అనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారిత సమయంలో అనుమతులు ఇవ్వాలని తెలిపారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో రెండు చొప్పున లేఅవుట్లు అనుమతులు పెండింగ్లో ఉన్నాయని ఆయన అన్నారు. శుక్రవారం తిరిగి సమావేశమయ్యే నాటికి ప్రభుత్వ నిబంధనలు మేరకు లేఅవుట్లో అండర్ డ్రైనేజ్ విద్యుత్తు, సెప్టిక్ ట్యాంక్, ఇంకుడు గుంత ,పచ్చదనం, 10% మార్టిగేజ్ వంటివి పొందుపరచాలని వాటిని ఏర్పాటు చేస్తున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖల తమ పరిధిలో వచ్చే అంశాలను పరిశీలించి వారం రోజుల్లో వివరాలను పొందుపరుస్తూ కలెక్టర్ కు లాగిన్ పంపాలని అక్కడ పరిశీలించి తుది లే అవుట్ అనుమతికి మున్సిపల్ కమిషనర్ కు పంపడం జరుగుతుందన్నారు .ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కామారెడ్డి ఆర్డీవో రంగనాథరావు ,మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్%డ%బి ఈఈ రవిశంకర్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి నర్సింహారావు, విద్యుత్ శాఖ ఎస్సీ రమేష్ బాబు, కలెక్టరేట్ పర్యవేక్షకులు జ్యోతి పాల్గొన్నారు.

# లింగంపేట్ వృద్ధాశ్రమంలో అన్నదానం



లింగంపేట్, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్

లింగంపేట్ మండల కేంద్రంలోని జీవధాన్ వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు గౌరి నవీన్ తెలిపారు. లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన ముదాం నవిత రెండో వర్ధంతి పురస్కరించుకొని ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో ముదాం స్వామి, బంధుమిత్రులు పాల్గొన్నారు.



# అంగన్వాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభానికి చర్యలు.

## రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ





**కామారెడ్డి బ్యూరో, సూర్య మేజర్ న్యూస్, జూన్ 25**

అంగన్వాడి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం రాష్ట్ర మహిళా స్త్రీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అంగన్వాడి కేంద్రాల అభివృద్ధి పై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా స్త్రీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడుతూ., ఐదు నుంచి ఆరు సంవత్సరాలుగా పిల్లల సంక్షేమం కోసం కృషి చేసిన ప్రముఖమైన స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్వాడి సెంటర్ల అభివృద్ధి కార్యచరణ పిల్లలకు నేర్పాల్సిన పాఠ్యాంశాలు పిల్లల అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యల ప్రణాళికలు రూపొందించామని అన్నారు. జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని చిన్న వయసులో పిల్లలకు నేర్పాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత అంశాలు నైపుణ్యాలతో కోర్సు సిద్ధం చేశామని అంగన్వాడి సెంటర్లలో పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్వాడీ టీచర్లకు ప్రత్యేక బుక్లెట్ రూపొందించామని జూలై మొదటి వారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆమె సూచించారు. ప్రతి అంగన్వాడి సెంటర్లో ప్లేమ్యాట్ ఏర్పాటు చేయాలని దీనిని రాష్ట్రస్థాయి నుంచి అందించడం జరుగుతుందని అదేవిధంగా జిల్లాస్థాయిలో సంక్షేమ శాఖ వద్ద అందుబాటులో ఉన్న నిధులతో ప్రతి అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు హల్నాదకరమైన వాతావరణం కల్పించేలా వాల్ పెయింటింగ్స్ వేయించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో సివిల్ వర్క్ కోసం మంజూరు చేసిన నిధులను వినియోగించుకుంటూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తాగునీరు అవసరమైన టాయిలెట్ల నిర్మాణం విద్యుత్తు మరమ్మత్తులు మొదలగు పనులు పూర్తి చేయాలని అన్నారు జిల్లా స్థాయిలో జరుగుతున్న అంగన్వాడి శిక్షణ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలకు ఏకరూప దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జూలై నెలలో అంగన్వాడీ పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని అప్పటివరకు నిర్దేశించిన పనులు పూర్తి చేయాలని అన్నారు. చిన్నపిల్లల్లో పోషక లోపాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ముందస్తుగా పోషక లోపం గల పిల్లలను అంగన్వాడీ టీచర్ల ద్వారా గుర్తించాలని అన్నారు. ప్రతి గ్రామం పట్టణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ టీచర్లు వారి పరిధిలో ఉన్న పిల్లల ఎదుగుదల గమనించాలని అవసరమైన వారికి అదనపు పోస్టాహారం పోషకాలు అందించాలని అన్నారు. గ్రామాలలో పట్టణాలలో ఉన్న ఒకటి నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు అంగన్వాడి కేంద్రాలలో రిజిస్టర్ చేయించి వారికి రెగ్యులర్గా పోస్టాహారం అందించాలన్నారు. కేంద్రాలలో ఉన్న పిల్లలకు ఎదుగుదల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని వయసుకు తగిన బరువు ఎత్తులేని పిల్లలను గుర్తించాలని పిల్లల్లో ఉన్న ఎదుగుదలకు మానసిక సమస్యలను ముందస్తుగా గుర్తిస్తే వాటిని త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు దివ్యాంగ సర్టిఫికెట్లు అందించేందుకు సదరం క్యాంపులలో అవసరమైన మేర స్లాట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14567 ద్వారా జిల్లాలో ఎవరైనా వయోవృద్ధులు వారి పిల్లలు సంతానము లేదా వారసులు సరిగ్గా చూసుకోనట్లయితే వారి సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహించినట్లయితే వారికి అందించాల్సిన కనీస అవసరాలతో పాటు జీవించే హక్కును కాలరాయడం దుర్భాషలాడడం భౌతిక హింస శారీరక మానసిక హింసలకు గురి చేసినట్లయితే వారిపై చట్టరీత్యా తగు చర్యలు జైలు శిక్ష జరిమానా విధించడం జరుగుతుందని ఈ సందర్భంగా సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా స్థానిక సంస్థలు ఆదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి జిల్లా సంక్షేమ అధికారి బావయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేటి విద్యాసంస్థల బందుకు విద్యార్థులు మరియు ఆయా పాఠశాల సిబ్బంది సహకరించాలి

### శ్రీకాంత్ ఏబీవీపీ కార్యవర్గ సభ్యులు

**బిచ్కుంద, సూర్య మేజర్ న్యూస్, జూన్ 25**

నేడు తలపెట్టిన విద్య సంస్థల బందు తరగతుల బహిష్కరణ కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు మరియు విద్యార్థిని విద్యార్థులు తమ వంతు పూర్తి సహకారం చూపాలని ఏబీవీపీ మండల కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల విషయమై ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యావ్యవస్థలో గుది బండలుగా మారిన ప్రైవేటు విద్యా వ్యవస్థలో ఫీజుల నియంత్రణ చేపట్టి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పన విషయంలో దృష్టి సారించి సమస్యలను పరిష్కరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎస్సీ వర్గీకరణలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

### ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు

**మాచారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, జూన్ 25**

మాచారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోరాటం చేయడం జరుగుతుందన్నారు. మందకృష్ణ ఆదేశాల మేరకు వచ్చే నెల 7న వరంగల్ లో జరిగే ఎమ్మార్పీఎస్ సదస్సుకు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు ఈ సందర్భంగా మాచారెడ్డి మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షుడిగా రమేష్ ను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



## టమాట@ రూ.100

**కామారెడ్డి అర్బన్, సూర్య మేజర్ న్యూస్ జూన్ 25:**

కామారెడ్డిలో రోజురోజుకి కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో టమాట ధర రూ. 100, పచ్చిమిర్చి రూ. 120, కొత్తిమీరు రూ.150, పాలకూర రూ.80 బీరకాయలు రూ.120, క్యాప్సికం రూ.120 క్యాబేజి రూ.80 పలుకుతుంది. దీంతో సామాన్య ప్రజలు కూరగాయలు కొనలేక అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కూరగాయల ఉత్పత్తి పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన డి ఆర్ డి ఓ

**బిక్కనూర్, జూన్ 25, సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పి సీఈవో, డి ఆర్ డి వో చందర్ నాయక్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం సందర్భంగా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అన్ని గ్రామ పంచా యతీలకు సంబంధించిన రికార్డులు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



## హైదరాబాద్ కి తరలివెళ్లిన వికలాంగులు

**రుద్రూర్, సూర్య మేజర్ న్యూస్, జూన్ 25**

వికలాంగుల సమస్యల పై హైదరాబాద్ లో నిర్వహించే కార్యాచరణ సమావేశానికి మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని వివిధ గ్రామాల నుండి వికలాంగులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో వికలాంగులు సాయిలు, మోహన్, క్లిక్ శంకర్ తదితరులు బయలుదేరి వెళ్ళారు.



## నేడు పాఠశాలల బంద్ ను విజయవంతం చేయాలి

**కామారెడ్డి రూరల్, సూర్య మేజర్ న్యూస్, జూన్ 25**

ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధువారం అన్ని విద్యా సంస్థలను మూసివేయాలని జిల్లా కన్వీనర్ రోహిత్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలలో అధికఫీజులు వసూలు చేస్తున్న విద్యాధికారులు పట్టించుకోవడంలేదని, ప్రభుత్వ పనితీరుకు నిరసనగా విద్యా సంస్థల బందుకు పిలుపునిచ్చినట్లు ఆయన చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు మూసి ఉంచాలని కోరారు.